క్లుప్తంగా

నమ్ముకున్న వారికి స్పష్టత ఇవ్వండి

- పవన్‌కు ద్వారంపూడి సలహా



కాకినాడ: వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలపై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. అన్ని స్థానాలకు పోటీ చేస్తారో, పొత్తులతో వెళతారో స్పష్టత లేకపోవడం వల్ల రాష్ట్రంలో జనసేనను నమ్ముకున్న ఎంతో మంది నేతలు రాజకీయాలపై ఆసక్తితో సొంత సొమ్మును ఖర్చు చేస్తున్నారని అన్నారు. చివరకు పవన్‌కళ్యాణ్ పొత్తులు పెట్టుకుని వాళ్లందరికీ మొండి చేయి చూపించే పరిస్థితి కనిపిస్తోందని, అదే జరిగితే వాళ్లంతా ఆర్థికంగా దివాలా తీసే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఆదివారం ఆయన తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ పొత్తులతోనే ఎన్నికలకు వెళతానని ఇప్పటికే కొంతమేరకు స్పష్టతనిచ్చిన పవన్ పోటీ చేసే స్థానాలపై కూడా స్పష్టత ఇవ్వాలని అన్నారు. అలా చేయడం వల్ల ఎంతోమందికి ఊరటను ఇచ్చిన వారవుతారని చెప్పారు.

టీడీపీకి ఇదే చివరి మహానాడు

ప్రస్తుతం జరుగుతున్న మహానాడే టీడీపీకి చివరిదని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ మరణానికి కారణమైన చంద్రబాబే ఆయన పేరుతో విగ్రహాలు పెట్టి మహానాడును నిర్వహిస్తున్న తీరు చూస్తుంటే విడ్డూరంగా ఉందని అన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. కార్యక్రమంలో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వర కల్యాణానికి రాట ముహూర్తం



వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవానికి పందిరి రాట వేస్తున్న పెద్దలు

కరప: మండలం కొంగోడులోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దివ్య కల్యాణోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. ముత్తైదువులు పసుపు కొట్టగా, గ్రామపెద్దలతో కలసి ఆలయ అర్చకులు పెద్దింటి రామానుజాచార్యులు పెండ్లి పందిరికి రాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను పెండ్లికుమారునిగా, పెండ్లికుమార్తెలుగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 31వ తేదీన రాత్రి 8.55 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మేడిశెట్టి సుబ్బారావు, ఆట్ల గోవిందరాజులు తదితర గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరాలు

పెద్దాపురం: ప్రతి సబ్జెక్టుపైన విద్యార్థులు పట్టు సాధించాలని కోటపాడు హెచ్ఎం ఆర్. వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించారు. అలాగే వరహాలయ్యపేట యాసలవు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) సమ్మర్ క్యాంప్‌ను నక్షత్ర దంత ఆస్పత్రి డాక్టర్ జమ్మి శిరీష సందర్శించి ప్రతీ విద్యార్థీ తమ దంతాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. దంత పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

ప్రాణాలు తోడేస్తున్నా.. పరిష్కారమేదీ?



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

- వీధి వీధినా రెచ్చిపోతున్న కుక్కలు
- నిత్యం 15 వరకు కుక్కకాటు కేసులు
- పూర్తిస్థాయి నియంత్రణకు అవరోధాలెన్నో
- అందుబాటులో రేబిస్ టీకా


కాకినాడ సిటీ: నగరంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవలి కాలంలో తరచుగా వినిపిస్తున్న మాట ×కుక్కల దాడిలో చిన్నారి మృతి×. ఈ కథనాలు చదివినా, చూసినా ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఒకవైపు రెడ్‌క్రాస్, జీవకారుణ్య సంఘాల ఒత్తిళ్లతో, మరో వైపు కోర్టుకేసులకు భయపడి అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. మధ్యేమార్గంగా పునరుత్పత్తి లేకుండా శస్త్రచికిత్సలు చేస్తున్నప్పటికీ అవేమీ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించలేని దుస్థితి. రూరల్ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలకు రోజుకు మూడు నుంచి నాలుగు కుక్కకాటు బాధితులు వస్తుండగా, జీజీహెచ్‌కు 10 నుంచి 15 మంది వరకు వస్తున్నారు. నగరంలోని ప్రధాన వీధుల్లో, ప్రతి గ్రామంలో కుక్కల బెడద మరీ ఎక్కువగా ఉంది. దీంతో ప్రజలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. సాధారణ కుక్కకాటుకు రేబిస్ వ్యాక్సిన్ ఐదు డోసులు, మరీ తీవ్రమైన గాయాలైతే ఇన్ఫెక్షన్‌ను నుంచి రక్షణ పొందడానికి అమినోగ్లోబిన్ వ్యాక్సిన్ వేయాల్సి ఉంటుంది. దీని విలువ రూ.2 వేల వరకు ఉంటుందని బాధితులు చెబుతున్నారు. 24 గంటల్లోపు టీకా తీసుకోకపోతే సదరు రోగి మృతి చెందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు రూరల్ పరిధిలోని నాలుగు పీహెచ్‌సీల్లో సుమారు 208 మంది, నగరపాలక సంస్థ పరిధిలో దాదాపుగా 1632 మంది వరకు ఉన్నారు.

యానిమల్ బర్త్ కంట్రోల్ ఎక్కడ?

కుక్కల సంతానం విచ్చలవిడిగా పెరగకుండా యానిమల్ బర్త్ కంట్రోల్ దిశగా అధికారులు కార్యాచరణ రూపొందించారు. కానీ ఇది ఆశించిన మేరకు కార్యరూపం దాల్చడం లేదు. నగరంలో గుర్తొచ్చినప్పుడు అప్పుడప్పుడు శస్త్రచికిత్సలు చేస్తున్నప్పటికీ, గ్రామాల్లో మాత్రం పూర్తిగా చేతులెత్తేశారు. ఒక శస్త్రచికిత్సకు సుమారు రూ.1,500 ఖర్చు వస్తుందని, నగరంలో 15 వేలకు పైగా కుక్కలు ఉన్నాయని అధికారులు అంటున్నారు. గ్రామాల్లో ఈ లెక్క ఇంకా తేలలేదు. శస్త్ర చికిత్స అనంతరం కుక్కలను ఐదు రోజులపాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలి. ఇది సాధ్యం కాని పని అని అధికారులే చెప్తున్నారు.

యానిమల్ కేర్ సెంటర్లు కరువు

ప్రతి మున్సిపాలిటీలో కుక్కలను తరలించి, వాటికి ప్రత్యేకంగా ఒక కేర్ సెంటర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. నగర పరిధిలో జగన్నాథపురంలో ఉన్న ఒకే ఒక్క కేంద్రం సేవలు నామమాత్రంగానే ఉన్నాయి.



బాలికను వెంటాడుతున్న కుక్కలు (ఫైల్)

రేబిస్ వ్యాక్సిన్లకు కొరత లేదు



కుక్కకాటుకు గురైనప్పుడు తప్పకుండా రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలి. అన్ని పీహెచ్‌సీల్లో ఈ టీకాలు అందుబాటులో ఉన్నాయి. కుక్కకాటుకు గురైనప్పుడు స్థానికంగా ఉన్న పీహెచ్‌సీలకు తీసుకెళ్లి డాక్టర్ పర్యవేక్షణలో రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి.

– ఆర్ రమేష్, డీఎం అండ్ హెచ్‌వో

పథకాలతో ప్రతి కుటుంబానికీ సంక్షేమం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- కూరాడలో గడప గడపకూ..



కూరాడలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ మేలు చేకూరుతోందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ఆదివారం కూరాడలో ఆయన పీఏసీఎస్ చైర్మన్ రావుల ప్రసాద్, సర్పంచ్ వాసంశెట్టి కొండ, ఎంపీటీసీ సభ్యురాలు గుత్తుల శాంతి, ఉప సర్పంచ్ రావుల శ్రీను, పార్టీ నాయకులు వెలుగుబంట్ల నారయ్య, గుత్తుల బాలాజీ తదితర స్థానిక నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో కలసి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, ఎవరికి ఏయే పథకాల ద్వారా ఎంతమేర లబ్ధి చేకూరిందో వివరంగా తెలియజేశారు. అర్హత ఉండి, ఎవరికైనా ఏ పథకమైనా మంజూరు కాకపోయినా తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కావాలని, డ్రైన్లు నిర్మించాలని కోరారని, త్వరలోనే వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు గడప గడపకూ వెళ్లి ప్రజల ఆశీర్వాదాలు కోరుతున్నామని, ప్రతి గడపలో విశేష ఆదరణ, ప్రజల నుంచి అపూర్వ స్పందన కనిపిస్తోందని ఎమ్మెల్యే కన్నబాబు తెలిపారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, జి.భావారం సర్పంచ్ రొక్కాల గణేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సవిలే రాజేష్, గ్రామ కార్యదర్శి కె.రవి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి



వలసపాకలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎన్టీఆర్ అభిమాని చంద్రమౌళి

కాకినాడ రూరల్: తెలుగుదనానికి నిలువెత్తు నిదర్శనం ఎన్టీఆర్ అని ఆయన వీరాభిమాని పుచ్చకాయల చంద్రమౌళి పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. వృద్ధులకు భోజనం ప్యాకెట్లు, మామిడిపండ్లు అందజేశారు. ఎన్టీఆర్ అభిమాని పుచ్చకాయల చంద్రమౌళి, బెంగళూరుకు చెందిన మరో అభిమాని కె.వి.సుబ్రహ్మణ్యం తదితరులు ఎన్టీఆర్ కళా, రాజకీయ సేవలను వివరించారు. అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే వలసపాకలలో నటరత్న కళామందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కూడా చంద్రమౌళి పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సర్పవరం జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి తదితరులు నివాళులర్పించారు.

పదోన్నతి పొందిన ఫార్మసిస్టులకు సన్మానం



పదోన్నతి పొందిన ఫార్మసీ సూపర్‌వైజర్, ఫార్మసిస్టులను సత్కరిస్తున్న ఎన్జీవో ప్రతినిధులు

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ ఫార్మసిస్టు అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్వసభ్య సమావేశం కాకినాడ ఎన్జీవో హోంలో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో జిల్లాలో పదోన్నతి పొందిన ఫార్మసీ సూపర్‌వైజర్, ఫార్మసిస్టు గ్రేడ్–1 పదోన్నతి పొందిన 28 మందిని సత్కరించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఎన్జీవో సంఘం పూర్వ అధ్యక్షుడు, విశ్రాంత ఫార్మసిస్టు బూరిగ ఆశీర్వాదం, జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు గుద్దటి రామమోహన్‌రావు, జిల్లా కార్యదర్శి పి వెంకటకృష్ణ పదోన్నతి పొందిన ఫార్మసిస్టులను సత్కరించారు. కాంట్రాక్టు ఫార్మసిస్టుల రెగ్యులరైజేషన్ కోసం కృషి చేస్తామని ఎన్జీవో నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టుల జిల్లా కార్యదర్శి కె.చక్రధారి, కోశాధికారి వి.వెంకటస్వామి, అసోసియేషన్ అధ్యక్షులు కేవీ రమణమూర్తి, వై.పద్మమీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామాగా కాకినాడ



కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

- ఎమ్మెల్యే ద్వారంపూడి
- అభివృద్ధి పనులకు శ్రీకారం



దివ్యాంగులకు వాహనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

కాకినాడ: కాకినాడ నగరాన్ని అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక 7వ డివిజన్‌లో రూ.90లక్షలతో ప్రతిపాదించిన వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. కొత్త కాకినాడ ప్రాంతంలో రహదారులు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు రెవెన్యూ కాలనీలో రూ.35లక్షలతో ఆధునీకరించిన షాదీఖానాను ఆదివారం ఆయన ప్రారంభించారు. రానున్న నాలుగైదు నెలల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియను కూడా వేగవంతం చేస్తున్నామని తెలిపారు. వచ్చే ఎన్నికలలోపు 90 శాతం పనులు పూర్తయి, వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పది డివిజన్లకు సంబంధించిన అభివృద్ధి పనులు ప్రతిపాదనలో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి ఎండీ అస్గర్, ఈఈ ప్రభాకర్, ఏఈ వై నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ చిట్నీడి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదరించేవారినే గెలిపించండి

షాదీఖానా ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలను ఆదరించే పార్టీలను వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లను ఎత్తివేస్తామంటూ తెలంగాణలో బీజేపీ ప్రకటించిందని, అటువంటి పార్టీల పట్ల ముస్లింలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం కట్టుబడి పని చేసే పార్టీలను ఆదరించి గెలిపించాలని అన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిం మైనారిటీల సంక్షేమానికి అవిశ్రాంతం శ్రమిస్తోన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్ళీ గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు.

దివ్యాంగులకు వాహనాల పంపిణీ

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే ద్వారంపూడి పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసిన పది మూడు చక్రాల స్కూటీ వాహనాలను తన నివాసం వద్ద ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఒక్కొక్కటి రూ.92 వేలు విలువైన ఈ వాహనాలను ప్రభుత్వం అర్హులకు ఉచితంగా సమకూర్చింది. వైఎస్సార్‌సీపీ నాయకులు సుంకర విద్యాసాగర్, కర్రి నారాయణ రావు, మాజీ కార్పొరేటర్లు, విభిన్న ప్రతిభావంతుల సహాయ సంస్థ సీఆర్‌ఓ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

- నేలకొరిగిన వృక్షాలు
- నష్టపోయిన మామిడి రైతులు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



కరపలో ఈదురు గాలులతో కురుస్తున్న వర్షం



అరట్లకట్టలో ఒక పక్కకు ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

కరప: అసలే రోహిణి కార్తె ఆపై ప్రచండుని ప్రతాపంతో ఆదివారం ప్రజలు విలవిలలాడారు. ఇంతలోనే సాయంత్రం 4 గంటలకు ఆకాశంలో దట్టమైన మబ్బులు కమ్మి గాలి బీభత్సం సృష్టించి వర్షం కురిసింది. ఈ గాలులకు మామిడికాయలు రాలిపోయి నష్టపోయామని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. బొండాలు రకం తక్కువరేటుకు అడుగుతున్నారని కళ్లాల్లోను, లే అవుట్లలోను ధాన్యం రాశులుచేసి ఉంచేశామని, గాలులకు రాశులపై కప్పిన బరకాలు ఎగురపోయి, తడిపోయాయని రైతులు తెలిపారు. నడకుదురు, వలసపాకల, అరట్లకట్ట గ్రామాల్లో విద్యుత్‌లైన్లపై చెట్లు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాయంత్రం నుంచీ రాత్రి 9.15 గంటలకు విద్యుత్ సరఫరా లేక గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. నడకుదురు వద్ద చెట్టు విరిగి విద్యుత్‌తీగలపై పడటంతో రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది.



వలసపాకలలో గాలులకు విరిగిపడిన తాడిచెట్టు